# పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం లిమిటెడ్.,
# నెం.(                    )

# నిబంధనావళి

**1. పేరు, నిర్మాణము మరియు చిరునామా:**

పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం లిమిటెడ్, రి.నెం..........................1964 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల 7వ చట్టము క్రింద రిజిష్టరు చేయబడినది.

**ఈ సంఘము యొక్క చిరునామా:**

సంఘం పేరు:...........................................................................................

గ్రామం:...................................................................................................

పోస్టు:....................................................................................................

మం: ......................................................................................................

జిల్లా:..................................................పిన్ కోడ్:.......................................

దీని వ్యవహారిక విస్తీర్ణము ..................................................................

...............................................................................................................

గ్రామములకు పరిమితమై యుండును.

**2. నిర్వచనములు :**

**i) చట్టము** అనగా ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము 1964.

**ii) నిబంధనలు** అనగా ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలు 1964.

**iii) సంఘము** అనగా ..................................................పాల ఉత్పత్తిదారుల సహకార సంఘము లిమిటెడ్...............................................................................

**iv) రిజిస్ట్రారు** అనగా ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల రిజిస్ట్రారు లేక ఆంధ్రప్రదేశ్ సహకార



సంఘముల చట్టము 3 వ సెక్షను ప్రకారం ప్రభుత్వముచే, రిజిస్ట్రారు అధికారములు దాఖలు పరచబడిన వ్యక్తి.

**v) సభ్యుడు** అనగా 6 వ నెంబరు బైలాలలో చెప్పబడిన ప్రకారం సంఘములో షేరు కలిగియ్యున్నవారు.

**vi) యూనియన్** అనగా ఆ జిల్లాకు చెందిన జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్.

**vii) కుటుంబము** అనగా భర్త, లేక భార్యలు, వారి మైనరు సంతానము, మరియు వారిరువురిలో యే ఒక్కడైనా బంధువులై యుండి వారిపై ఆధారపడియున్నవారు.

**సహకార సంవత్సరం :** అనగా ప్రస్తుత సంవత్సరం ఏప్రిల్ మొదటి తేదినుండి మరసటి సంవత్సరం మార్చి చివరి తేది వరకు అని అర్థం.

**3. ఉద్దేశ్యములు :**

సంఘ ఉద్దేశ్యములు ఈ దిగువ చెప్పబడినట్లుగా యుండవలెను.

i) శుభ్రమైన పాలను సేకరించుట, ప్రతి ఆవు, లేక గేదె యిచ్చు పాల ఉత్పత్తిని పెంపొందించుట మరియు ఈ ఉద్దేశ్యములను నెరవేర్చుట.

ii) యూనియన్ ద్వారా సేకరించిన పాలను హెచ్చు లాభమునకు విక్రయించుటకు వసతులను సమకూర్చుట.

iii) మంచి వంగడములను, ఆరోగ్యవంతమైన పశువులను పోషించుటకు వివిధ పాడి విస్తరణ, పశుసంవర్ధక కార్యకలాపములను చేపట్టుట.

iv) పశువుల సమీకృత పోషకాహారమును విక్రయించుటకు పశుగ్రాస ఉత్పత్తిని అధికము చేయుటకు తగిన చర్యలను గైకొనుట.

v) పశువుల మేతకు అనువైన పచ్చిక బయళ్ళను ఖరీదు చేయుటకు లేక కౌలుకు తీసుకొనుట మరియు పశువుల శాలలను లేక పాడి పరిశ్రమకు భవనములను నిర్మించుట లేక పునరుద్ధరించుట.

vi) సభ్యులలో పొదుపు, స్వయం సహాయములను ప్రోత్సహించుట.

vii) పాడి పరిశ్రమను సహకార పద్ధతులలో నిర్వహించుటను గురించి ప్రచార ప్రబోధములు చేయుట.

viii) పై ఉద్ధేశ్యముల సాధనకు కావలసిన, లేక సహాయభూతమైన మరే యితర చర్యలనైనా

చేపట్టుట.

**4. బాధ్యత :** సంఘ సభ్యుల బాధ్యత, వారు చెల్లించిన షేరు ధనమునకు పరిమితమై యుండును.

**5. మూలధనము :** ప్రస్తుతమునకు సంఘము అనుమతించబడిన మూలధనము రు. ............ – షేరు ఒక్కింటికి రూ. .......... ల చొప్పున, ............ షేర్ల రూపములోనుండును. షేరు విలువ మొత్తమును షేరు కేటాయింపబడిన వెంటనే ఒకే మొత్తములో చెల్లించవలెను.

**6. సభ్యత్వము :**

అ) i) పాలు ఉత్పత్తి చేయు ఉత్పత్తిదారులు, అదే గ్రామస్తులై, 18 సంవత్సరములు నిండిన వయస్సు కలిగి, లావాదేవీలు చేయు అర్హత కలిగియున్నవారు;

ii) పాల ఉత్పత్తికొరకు గేదెను/ఆవును పెంచుచు, పాలను యూనియన్‌కి/సమాఖ్యకు/ పాల సేకరణ కేంద్రమునకు, గత ఆరు మాసములలో 90 రోజులపాటు యిచ్చియున్నవారు;

iii) సంఘముతో తప్ప యితరులతో పాల వ్యాపారమునుగాని, పాలతో తయారైన వస్తువుల వ్యాపారముగాని చేయనివారు;

iv) సంఘమునకు భవిష్యత్తులో కూడా పాలు సరఫరా చేయుటకు, వ్రాత మూలకంగా అంగీకరించినవారు షరతులు పాటించినవారు మాత్రమే సంఘములో సభ్యులుగా ఉండుటకు అర్హులు.

ఆ) కుటుంబములో ఎవరో ఒక్కరే ఆడ లేక మగ వ్యక్తి సంఘములో సభ్యత్వము కలిగియుండవచ్చు. ఆయన/ఆమె దరఖాస్తుపై సంతకము చేయవచ్చు. సంఘము ఏర్పాటు చేయునప్పుడు ప్రమోటరుగా సంతకము చేయవచ్చును.

ఇ) ఏ వ్యక్తియైన :

i) తాను దివాలా తీసినట్లుగా ప్రకటించవలసినదిగా కోరియున్నను, లేక దివాలా తీసినట్లుగా విమోచనము పొందియుండకున్ననూ,

ii) అవినీతి నేరమునకు శిక్షింపబడినవారు, అటువంటి శిక్ష రద్దు చేయబడని వాడు, అటువంటి శిక్షాకాలము ముగిసిన తేదీనుండి 3 సంవత్సరములు నిండనప్పుడు,

iii) సంఘములోకాని, యూనియన్‌లోకాని వేతనోద్యోగిగా ఉన్నవారు,

iv) 1964 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల 7 వ చట్టము క్రింద సభ్యత్వమునుండి తొలగింపబడినవారు, తొలగింపబడిన తేదీ నుండి సంవత్సరకాలము నిండనివారు,

v) ఆ కాలమునకు పాలు సప్లయి చేయనివారు, బైలా నెం 36 క్రింద చెప్పబడిన మొత్తమును సప్లయి చేయనివారు సభ్యులుగా ప్రవేశమునకు లేదా సభ్యులుగా పాటింపబడుటకు అర్హత కోల్పోవుదురు.

ఈ) సంఘములో సభ్యుడుగా చేరిన ప్రతి వ్యక్తి కనీసము ఒక షేరైనా తీసుకొనవలెను. అయితే ఏ సభ్యుడూ, ఎప్పుడు కూడ, ........... షేర్లకు రూ. ............. లు ముఖపత్ర విలువగల వాటాలు మించి కలిగియుండరాదు. సభ్యుడుగా చేర్చుకొనుట, వారికి షేర్లను కేటాయించుట పాలకవర్గము చేయవలెను.

ఉ) ప్రవేశము పొందిన ప్రతి సభ్యుడు షేరు ఒక్కింటికి రు. .......... చొప్పున ప్రవేశ రుసుము చెల్లించవలెను.

**7. అ) సభ్యత్వమునకు ప్రవేశము :**

సభ్యత్వమునకు చేయబడు ప్రతి దరఖాస్తు నిర్ణీత ఫారములో వ్రాయబడి సంఘ అధ్యక్షులు పెట్టుకొనబడి యుండవలెను. అటువంటి దరఖాస్తుదారు సదరు దరఖాస్తు ఫారములో, తాను యిదివరకు యేదేని సంఘము లేక సంఘములలో సభ్యుడుగానున్న యెడల ఆ సమాచారమును, అనగా ప్రవేశించిన తేదీలు, కలిగియున్న షేరుధనము మొదలగు వివరములను తెలుపవలెను. ఈ దరఖాస్తు తేదీనాటికి ఆ యితర సంఘములనుండి తాను అందుకున్న సేవల వివరములను కూడా ఉదహరింపవలెను. బైలా నెంబరు 6(అ) క్రింద సభ్యత్వము కల ఏ దరఖాస్తుదారునికి సంఘము, తగిన కారణము లేకుండా సభ్యత్వమును నిరాకరించరాదు. పాలకవర్గము సభ్యత్వమును నిరాకరించుటకు నిర్ణయించినయెడల అందుకు గల కారణముల గ్రంధస్థము చేయవలెను. ప్రవేశమును నిరాకరించినప్పుడు, ఆ నిర్ణయమును, అందుకు గల కారణములతో సహా, ఆ వ్యక్తికి రిజిష్టరు పోస్టుద్వారా, నిర్ణయించిన తేదీనుండి 15 రోజలలోగాకాని, సభ్యత్వమునకు దరఖాస్తు చేసిన తేదీనుండి 60 రోజులలోపు గాని, ఏది ముందైతే అప్పటివరకు సంఘము తెలుపవలెను. తెలిపియుండని యెడల, సదరు గడువు తేదీ ముగిసిన తరువాత రోజునుండి సభ్యుడుగా చేర్చుకొనినట్లు భావించబడును. కార్యదర్శి సభ్యత్వ ప్రవేశమును అమలు పరచవలెను. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టము 19 వ సెక్షన్ 3 వ సబ్‌సెక్షన్ క్రింద చేర్చుకొనబడినవారిని, లేక సదరు సెక్షన్ క్రింద విధులననుసరించి సభ్యులుగా చేర్చుకొనబడినట్లు భావింపబడినవారిని, ప్రవేశపుస్తకములో సదరు వ్యక్తిని సభ్యునిగా చేర్చుకొనవలసినదిగా లేదా చేర్చుకొనబడినట్లుగా

భావింపబడినట్లుగా తీర్మానము చేయబడిన తేదీనుండి ముప్పది రోజులలోపు నమోదు చేయవలెను.

**గమనిక :**కార్యదర్శి, నిర్ణీత పద్ధతిలో, ఒక రిజిష్టరును, చేర్చుకొనబడిన సభ్యుల పేర్లను నమోదు చేయుటకు వ్రాయుచుండవలెను.

బి) సభ్యత్వమునకు ప్రవేశమును నిరాకరించినప్పుడు చట్టములోని 76-వ సెక్షన్ (2) వ సబ్ సెక్షన్ క్రింద రిజిస్ట్రారుకు అప్పీలు చేసుకొనుటకు అధికారము కలదు.

సి) ఇటువంటి ఉద్దేశ్యములే కల వేరు సహకార సంఘములలో సభ్యుడుగా ఉన్న వ్యక్తిని సంఘములో సభ్యుడుగా చేర్చుకొనరాదు.

**8. షేరు సరిఫికెట్ :**

ఎ) సంఘ సభ్యునికి ప్రతి ఒక్కరికి, ఆయన తీసుకున్న వాటాలకు పూర్తిగా షేరు ధనమును చెల్లించిన మీదట సంఘ అధ్యక్షుడు, కార్యదర్శి సంతకములు చేసి, సంఘ ముద్ర వేసి షేరు సర్టిఫికేట్టు జారీచేయవలెను.

బి) షేరు సర్టిఫికెట్ పోయిన లేక పాడైపోయిన సందర్భములో నకలు సరిఫికెట్‌ను వాటాదారునుండి, పూచీకత్తును తీసుకొని యివ్వవచ్చును. సర్టిఫికెట్ పోగొట్టుకొనినప్పుడు లేదా చెడిపోయినప్పుడు పాలకవర్గము దానిని రద్దుచేసి, దానిని స్వాదీనము చేసిన తరువాత, దానికి బదులుగా, సర్టిఫికెట్ నకలును యివ్వవచ్చు.

**9. వాటాల మార్పిడి :**

అ) ఏ సభ్యుడూ, తనవాటా, వేరొకరికి, అట్టి మార్పిడి పొందు వ్యక్తి సంఘ సభ్యుడై యున్నప్పుడు తప్ప మార్చకూడదు. మరియు బైలా 7(అ) ప్రకారము ఆ మార్పిడి పాలకవర్గము ఆమోదము పొందియుండవలెను. సభ్యుడు చేయు వాటా మార్పిడి ఈ దిగువ పరిస్థితులలో చెల్లదు.

i) సభ్యుడు సదరు వాటా ఒక సంవత్సరముపాటైనా తన పేరుమీద కలిగియుండవలెను.

ii) మార్పిడి అప్పటి సంఘములో సభ్యుడుగా ఉన్న వారికి బైలా నెం. 6 లో చెప్పబడిన సూత్రములననుసరించి పాలకవర్గముచే సభ్యునిగా చేర్చుకొనబడినవారికి మాత్రమే చేయబడవలెను.

ఆ) వాటాల మార్పిడిని కోరుతూ దరఖాస్తు ఏదైనా అందిన యెడల, కొత్తగా వాటాల కేటాయింపుకు వచ్చిన దరఖాస్తు కన్న మార్పిడికి వచ్చిన దరఖాస్తుకు ప్రాధాన్యత ఇవ్వవలెను.

**10. షేరు ధనము వాపసు తీసుకొనుట మరియు రాజీనామా :**

అ) ఏ సభ్యుడును తాను సంఘములో పొందియుండు షేర్లను వాపసు తీసుకొనుటగానీ,



లేక సంఘమునుండి తన సభ్యత్వమునకు రాజీనామా చేయుటకుగాని, ఆయన సంఘములో సభ్యుడుగా చేర్చుకొనబడిన తేదీనుండి మూడు సంవత్సరములలోగా అనుమతింపబడరాదు. ఆ కాలము గడచిన తరవాత పాలకవర్గము యొక్క అనుమతి పొంది ఆ సభ్యుడు ఏవైనా తన షేర్లను వాపసు తీసుకొనవచ్చు. అయితే జామీనుగా ఉన్న అప్పులు ఏవి కూడా అప్పటికి సంఘమునకు బాకీ యుండకూడదు.

ఆ) సభ్యుడు తన సభ్యత్వమునకు రాజీనామా చేయదలచినపుడు రాజీనామా పత్రమును సంఘముయొక్క అధ్యక్షుని పేర రిజిష్టరు పోస్టులో పంపవలెను. ఆ ఉత్తరము అధ్యక్షునికి చేరిన తేదీనుండి సదరు రాజీనామా అమలులోకి వచ్చును. వాపసు తీసుకొనుటకు అనుమతి యిచ్చిన షేర్ల విలువ, లేదా సభ్యత్వమునకు రాజీనామా యిచ్చిన సభ్యుని యొక్క షేరు ధనమునుగాని, డివిడెండ్‌తో సహా అతనికి చెల్లించవలయును. వాపసు తీసుకొనబడిన మొత్తము షేరుధనము యిచ్చివేయబడిన మొత్తము షేరు ధనము, గత మార్చి 31 వ తేదీ రోజున ఉన్న సంఘ మొత్తము వాటా ధనములో 10 శాతమునకు మించరాదు. ఈ పరిమితి 12 మరియు 14 బైలాల క్రింద వాపసు యివ్వబడిన షేరు ధనమునకు తప్ప మిగతా అన్ని వాపసు మొత్తములకు వర్తించును.

**11.** 1 వ నెంబరు బైలాలో నిర్దేశింపబడిన వ్యావహారిక విస్తీర్ణము వెలుపలికి తన నివాసము మార్చినందువలనకాని, మరేదైనా యితర కారణములచేతగాని ఒక సభ్యుడు తన సభ్యత్వమునకు అనర్హుడైనప్పుడు, సంఘము అట్టివారి పేరును సభ్యుల పట్టీనుండి తొలగించి ఆ సభ్యుడు అసలు బాకీ దారుగాగానీ, జామీను దారుగాగాని వున్న అప్పుల మొత్తము ఏమైన సంఘమునకు బాకీయున్న యెడల వాటిని మినహాయించుకొని అట్టి సభ్యుడు చెల్లించియుండు వాటా ధనమును, డివిడెండు ఏదేనియు ప్రకటించిన యెడల దానితో సహా న్యాయ సమ్మతమైన గడువులోగా అతనికి చెల్లించవలెను.

**12. సభ్యుడు చనిపోయినప్పుడు వారసుల నియామకము :**

1. సభ్యుడెవరైనా మరణించిన యెడల, ఆ కారణముచేతనే ఆయన సభ్యత్వము ముగిసిపోవును. ప్రతి సభ్యుడు తమ నామ నిర్ధిష్టు(నామిని) ని నియమించవచ్చు. సభ్యుడు మరణించుట సంభవించినయెడల, ఆయనకు రావలసిన షేరు లేక షేరులకు చెందిన ధనము, లేక మరే యితర ధనము ఆ నామ నిర్ధిష్టునికి యివ్వబడును. అట్లు నియమితులైన వ్యక్తుల సంఖ్య ఆ సభ్యునకు సంఘములోకల వాటాల సంఖ్యకు మించరాదు. ఏ సభ్యుడు కాని వారసులను నియమించునప్పుడు విలువలతో సూచించవలెను.

2. సభ్యుడు చేసిన నియామకము లేదా అందులోని ఏదేని మార్పు లేక రద్దు ఈ దిగువ పరిస్థితులలో తప్ప, ఆయన తదనంతరము చెల్లనేరదు.

i) అది వ్రాత మూలకముగా నిర్దేశించబడి, కనీసము యిద్దరి సాక్షుల సమక్షములో, ఆయనచే సంతకము చేయబడి యుండవలెను.

ii) ఇందు నిమిత్తము వ్రాయబడుచున్న సంఘ పుస్తకములలో అది నమోదు చేయబడి యుండవలెను.

3. సభ్యుడెవరైనా తన తదనంతర వారసుని నియమించక మరణించినచో అతని వాటాధనము వాపసు చేయు విషయములో సంఘము తన కార్యాలయము వద్ద నోటీసు బోర్డులో ప్రకటించి, చనిపోయిన సభ్యుని వారసుని లేక యితర శాసనాధికార ప్రతినిధుల యొక్క క్లెయిములను రుజువుపరచుకొనవలసినదిగా, లేక అభ్యంతరములు ఏవైనా ఉన్నచో వానిని నిర్ణీత కాలములో తెలుపవలసినదిగా కోరవలెను. అట్టి క్లెయిములు లేక అభ్యంతరములను పరిశీలించి వాటిపై తాము యుక్తమని భావించిన విధముగా విచారణ జరిపి చనిపోయిన వ్యక్తి వారసునికి లేక శాసనాధికారి ప్రతినిధిని నిర్ణయించి అట్టి యిరువురి నుండి హామీని పొంది చనిపోయిన సభ్యుని షేరు ధనము మొత్తమును మరియు యితర పైకములను పాలకవర్గము వారు చెల్లించవచ్చు.

**13. సభ్యత్వము నుండి తొలగిన సభ్యునికి, చనిపోయిన సభ్యుని ఆస్తికిగల పూచీ :**

అ) సంఘము యొక్క ఋణములకు సంబంధించినంతవరకు, సభ్యత్వము నుండి తొలగిన వ్యక్తి, లేక సంఘములోని తన వాటాధనమును మార్పిడి చేసిన వ్యక్తి లేక మరణించిన వ్యక్తి ఆస్తి మరణించిన తేదీనుండి రెండు సంవత్సరముల కాలము వరకు బాధ్యత కలిగియుండును.

ఆ) పై (అ) ఉపనిబంధనలో ఏమి చెప్పబడి యున్నప్పటికి, దానితో నిమిత్తము లేకుండా సంఘ వ్యవహారములు చట్టములోని 64 వ సెక్షన్ ప్రకారం రద్దు చేయబడినచో, అట్టి రద్దు చేయబడిన తేదీనుండి రెండు సంవత్సరముల కాలమునకు ముందుగా తొలగిన సభ్యుని, చనిపోయిన సభ్యుని బాధ్యత, సంఘ ముగింపు చర్యలు పూర్తి అగువరకు ఉండగలదు. కాని అట్టి బాధ్యత, సభ్యత్వము తొలగిన రోజున లేక సభ్యుడు మరణించిన రోజున సంఘమునకుగల అప్పులకు పరిమితమై యుండును.



**14. సభ్యత్వము నుండి తొలగింపు :**

1. ఏ సభ్యున్ని అయినా, మహాజన సభ మూడింట రెండు వంతుల మెజారిటీతో సభ్యత్వము నుండి ఈ దిగువ కారణములకు తొలగించవచ్చును.

i) వాయిదాలను సకాలంలో చెల్లించుట తరచు తప్పిన యెడల;

ii) తప్పుడు ప్రకటనలను చేయుచు సంఘమును బుద్ధి పూర్వకముగా మోసగించినయెడల;

iii) సంఘ ప్రతిష్టకు భంగము కలిగించే పనులను బుద్ధిపూర్వకముగా చేసిన యెడల;

iv) పాలకవర్గమువారి సూచనలను, తీర్మానములను అదేపనిగా అగౌరవపరచినయెడల;

v) పాలనిచ్చు గేదెనుగాని, ఆవునుగాని కలిగిఉండి, పాలను యితరులకు విక్రయించినా లేక యితరులతో పాల మరియు పాల ఉత్పత్తుల క్రయ విక్రయ వ్యాపారము చేయుచున్న యెడల;

vi) సంఘ వ్యాపార విస్తీర్ణములో సరిగా నివసించకపోయిన యెడల సభ్యుడగుటకు ఉండవలసిన లక్షణములను కోల్పోవుచున్నయెడల;

vii) 36 వ బైలా క్రింద అనర్హతలను కలిగియున్నయెడల; అయితే సభ్యుని తొలగించుటకు పూర్వము, మహాజన సభ ఎదుట అతని వాదనను విన్నవించుకొనుటకు అవకాశము ఇవ్వవలెను. సహకార చట్టముననుసరించి మహాజన సభ తీర్మానము ఆమోదమును పొందవలెను. అట్టి తీర్మానము కాపీని సభ్యునికి అందజేయవలెను.

**15. నిధులు:**

సంఘము సాధారణముగా ఈ దిగువ పద్ధతులలో నిధులను సేకరించును.

1. వాటాధనము;
2. డిపాజిట్లు;
3. ఋణములు
4. ప్రవేశ రుసుములు మరియు చిల్లర జమలు
5. సభ్యులనుండి, యితరులనుండి విరాళములు

**16. డిపాజిట్లు :**

ఈ దిగువ నిబంధనలకు, షరతులకు లోబడి పాలకవర్గము సభ్యులనుండి ఫిక్స్‌డ్ డిపాజిట్లను సేకరించవచ్చు.

i) ఒక నిర్ణీత మొత్తమును, నిర్ణీత కాలవ్యవధికి స్వీకరించునది ఫిక్స్‌డ్ డిపాజిటు రు......లకు లేక, దాని గుణిజములకు తగ్గిన మొత్తములను కనీసము 6 నెలల వ్యవధికి తగ్గకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లను స్వీకరించరాదు.

ii) రూ. 100 లకు తగ్గిన డిపాజిట్లపై వడ్డీరేటు, అట్టి డిపాజిట్లపై, సాధారణముగా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారిచ్చు రేటుకు 1 శాతం తక్కువగా యుండవలెను. సభ్యునిుండి ఫిక్స్‌డ్ డిపాజిటు ఒక సంవత్సర కాలమునకు మరియు రు. 100/- ల మొత్తమునకు తక్కువకాక యుండినచో అట్టి డిపాజిట్టు బ్యాంకు రేటు ప్రకారము వడ్డీని ఇవ్వవచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్లమీద వడ్డీ సంవత్సర కాలమునకుకాని, లేదా డిపాజిటు చేయునపుడు ఒప్పందము చేసుకొన్న ప్రకారము తక్కువ కాలమునకు కాని యివ్వవచ్చు.

iii) డిపాజిటు చేసిన గడువు తీరులోగా, తిరిగి కనీసం మరో ఆరు నెలలు కాలము తన డిపాజిటును పొడిగించగలనని డిపాజిటుదారునుండి సంఘమునకు నోటీసు అందిననేతప్ప, అట్టి డిపాజిటుపై గడువు తీరిన తేదీనుండి వడ్డీ చెల్లింపబడదు. డిపాజిటు గడువు తీరిన తరవాత కూడా సంఘము దానిని విధిగా కొనసాగించవలసిన పనిలేదు. అయితే అట్టి కొనసాగింపు నిరాకరింపబడినచో, అట్లు నిరాకరించు తేదీ వరకు దానిపై వడ్డీ చెల్లించవలసియుండను.

**17. ఋణములు :**

సంఘ ఉపయోగార్థము, జిల్లా కేంద్ర సహకార బ్యాంకునుండిగాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకునుండిగాని సహకార సంఘముల చట్టము క్రింద రిజిష్టరైన ఏ సంస్థనుండిగాని, లేదా రిజిస్ట్రారు వారి అనుమతి పొందిన ఏ యితర పబ్లిక్ ఫైనాన్సింగ్ సంస్థనుండిగాని, లేదా ప్రభుత్వమునుండిగాని లేదా ఏ షెడ్యూల్డు బ్యాంకునుండిగాని పాలకవర్గము ఋణములను తీసుకొనవచ్చును. అందుకు సంబంధించిన పత్రములు లేక యితర పత్రములపై అధ్యక్షుడు మరియు పాలకవర్గములోని మరొక సభ్యుడు సంతకములు చేసిన మీదట సంఘ కార్యదర్శిచే ధృవీకరింపబడిన సంఘ ముద్ర వేయబడవలెను.

**18. సంఘ గరిష్ఠ ఋణాధికారము:**

సంఘ గరిష్ట ఋణాధికార పరిమితి ఏ కాలమునందైననూ, సంఘములో చెల్లింపబడిన షేరు ధనము మరియు రిజర్వు నిధుల మొత్తమునకు 8 రెట్లకు లేదా ఎప్పటికప్పుడు రిజిస్ట్రారు విధించు షరతులకు లోబడి ఆయన అనుమతించునట్టి హెచ్చు మొత్తమునకు పరిమితమై యుండును.



**19. పాలక వర్గము:**

సంఘ పాలనాధికారము పాలకవర్గ ఆధీనములో ఉండును. పాలకవర్గము 9 మంది సభ్యులకు మించరాదు. పాలకవర్గ సభ్యులందరు ఒకే పర్యాయము మహాజన సభ వారిచే ఎన్నుకొనబడవలెను. పాలకవర్గ సభ్యుల ఎన్నిక 1964 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల నిబంధనలోని దఫదఫాల సవరించబడిన ప్రకారం 22 వ నిబంధననుసరించి జరుపబడవలెను.

**20. పాలక వర్గము యొక్క పదవీకాలం :**

పాలకవర్గ సభ్యులు అందరు, ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము 1964 విధుల ననుసరించి దాని క్రింద చేయబడిన నిబంధనల ననుసరించి ఎన్నిక తేదీనుండి ఐదు సంవత్సరముల కాలము పదవిలో నుండుటకు ఎన్నుకొనబడవలెను. పాలకవర్గములో, అనుకోకుండా ఖాళీ ఏర్పడిన ఆ ఖాళీలను కోఆప్షన్ ద్వారా అసలు కాలములో మిగతా కాలమునకు భర్తీ చేసుకొనవలెను. పాలకవర్గములోని ఏ సభ్యుడినైనా తొలగించి ఆయన స్థానములో వేరొక సభ్యుని ఎన్నుకొనుటకు మహాజన సభకు అధికారము కలదు. ఈ ఎన్నుకోబడిన సభ్యుడు మిగతా కాలమునకు పదవిలో ఉండును. పాలకవర్గములో ఖాళీ, లేక ఖాళీలు ఏర్పడి, అవి భర్తీ కానంతమాత్రాన పాలకవర్గము వారి చర్యలు చెల్లకపోవు.

పాలకవర్గములోని ఎన్నిక కాబడిన సభ్యుడెవరైనా, ఎప్పుడైనా, తన పదవికి రాజీనామా చేయవచ్చు. రాజీనామా ఉత్తరమును అధ్యక్షుని పేర వ్రాసి కార్యదర్శికి పంపిన మీదట పాలకవర్గము ఆమోదించు తేదీనుండి రాజీనామా అమలులోనికి వచ్చును.

**21. పదవీ నిర్వాహకుల ఎన్నిక :**

పాలకవర్గ సభ్యులు తమలోనుండి ఒక అధ్యక్షుని ఎన్నుకొనవలెను. 1964 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలలో చెప్పబడినట్లు అధ్యక్షుడు మహాజన సభలకు లేదా పాలకవర్గ సమావేశములకు అధ్యక్షత వహించవలెను. అధ్యక్షుడు లేనప్పుడు సభలో ఉన్న సభ్యులనుండి ఒకరిని సభకు అధ్యక్షులుగా ఎన్నుకొనవలెను. ఓట్లు సరి సమానము వచ్చినప్పుడు సభాధ్యక్షత వహించిన అధ్యక్షునకు "క్యాస్టింగ్ ఓటు" అను అదనపు ఓటు ఉండును. పాలకవర్గ సభ్యుడు అధ్యక్షునితో సహా తనకు ప్రత్యక్షముగాకాని, పరోక్షముగాగాని సంబంధించిన విషయమేదైనా చర్చకు వచ్చినప్పుడు సభలో ఉండరాదు.

**22. పాలకవర్గ సమావేశము :**

అ) సంఘ వ్యవహారములు చర్చించి నిర్ణయము చేయుటకు, కార్యదర్శి పాలకవర్గ

సమావేశములను కనీసము నెలకొకసారి కాని అంతకు తక్కువ వ్యవధిలో ఏర్పాటు చేయవలెను. ప్రత్యేక పరిస్థితులలో అధ్యక్షుడు పాలకవర్గ సమావేశమును ఏర్పాటు చేయవచ్చు. పాలకవర్గ సభ్యులలో కనీసము 5 గురు సభ్యులు కాని మరియు రిజిస్ట్రారుగాని, పాలకవర్గ సమావేశమును ఏర్పాటు చేయవలసినదిగా వ్రాతపూర్వకముగా కోరినప్పుడు అధ్యక్షుడు సదరు నోటీసు అందిన 15 రోజులలోపు పాలకవర్గ సమావేశమును ఏర్పాటు చేయవలెను. పాలకవర్గ సమావేశమునకు కోరం 5 కావలెను. పాలకవర్గము చర్చించిన విషయములన్నియు అధిక సంఖ్యాకమైన ఓట్లచే నిర్ణయింపబడవలెను.

**23) పాలకవర్గ సభ్యుల అనర్హతలు :**

బైలా నెంబరు 36లో చెప్పబడిన అనర్హతను ఆపాదించుకున్న వ్యక్తులతోపాటు ఈ దిగువ అనర్హతలున్న వ్యక్తి ఎవరూ పాలకవర్గ సభ్యుడుగా ఎన్నుకొనబడుటకు లేదా పాలకవర్గ సభ్యుడుగా ఉండుటకు అర్హుడు కాడు.

ఎ) సంఘము వేతనోద్యోగికి దగ్గరి బంధువు అయినచో,

బి) మూడు మాసముల కాలపరిమితికి నగదురూపముగా గాని, వస్తురూపముగా గాని సంఘమునకు రావలసిన ఏదైన మొత్తమును చెల్లించకుండవున్న బకాయిదారుడైనచో

సి) ఒక డిక్రి, నిర్ణయము, తీర్పు లేదా ఉత్తరువుకింద చెల్లించవలసిన ఏదైన మొత్తము రాబట్టుకొనవలసిన వ్యక్తి అయినచో,

డి) సంఘములో అమలునందున్న ఏదైన కాంట్రాక్టుతో లేదా సంఘమునకు చేయుచున్న ఏదైనా పనిలో ఏదైనా హితము సంపాదించునెడల,

ఇ) అస్వస్థచితుడై యుండి ఆ అనర్హతను న్యాయస్థానముచే ఆ విధముగా ప్రకటింపబడి యున్నచో, లేదా చెవిటి - మూగ లేక కుష్టువ్యాధిగ్రస్తుడైనచో,

ఎఫ్) సంఘము తరపున లీగల్ ప్రాక్టీషనరుగా నియమింపబడినచో, లేదా సంఘమునకుగాని సంఘ సభ్యునికిగాని ప్రతిముఖముగా లీగల్ ప్రాక్టీషనరుగా నియమించబడినచో,

జి) సభ్యత్వమునకు 6(అ) బైలాలలో నిర్ణయింపబడిన ఏ అర్హతలనైనా లేనివారు చట్టములో చెప్పబడిన ఇతర అనర్హతలు కలవారు పాలకవర్గ సభ్యత్వమునకు అనర్హులు

**24. పాలకవర్గ సభ్యత్వ విరమణ మరియు పునరుద్ధరణ :**

ఏ పాలకవర్గ సభ్యుడైననూ పాలకవర్గ సమావేశములకు వరుసగా మూడుసార్లు హాజరు



కాకపోయిన ఎడల తన పాలకవర్గ సభ్యత్వమును కోల్పోవును. ఆ విషయమును సదరు సభ్యునకు తెలియజేయవలెను. తదుపరి పాలకవర్గ సమావేశమునకు ఆ విషయమును కార్యదర్శి తెలియజేయవలెను. సభ్యునివద్దనుండి జవాబు ఏదైనా వచ్చినయెడల దానిని కూడ పాలకవర్గము ముందుంచవలెను. పాలకవర్గము కోరినప్పుడు వ్రాతపూర్వకముగా సభ్యుడు పునరుద్ధరణను కోరిన యెడల సదరు సభ్యుని సభ్యత్వమును పునరుద్ధరించవచ్చును. అయితే పాలకవర్గ పదవీ కాలములో ఒకసారికన్న హెచ్చు పర్యాయములు ఒక వ్యక్తి సభ్యత్వమును పునరుద్ధరించరాదు.

**25. పాలకవర్గము అధికారములు - విధులు:**

ఈ చట్టములోని నిబందనలు, నియమములు, బైలాల మరియు మహాజన సభ తీర్మాణము మేరకు సంఘ పాలక వర్గము ఈ క్రింది అధికారములు, విధులు నిర్వహించవలసి యుండును.

i) సభ్యులను చేర్చుకొనవలసినదిగా మహాజన సభకు సిఫారసు చేయుట

ii) చేర్చుకొనబడినవారికి వాటాలను కేటా యించుటకు, బదిలీచేయుటకు మహాజన సభకు సిఫారసు చేయుట.

iii) సెక్షన్-21 మేరకు అనర్హత పొందిన సభ్యులను తొలగించుటకుగాను మహాజన సభకు సిఫారసు చేయుట

iv) సెక్షన్-21ఎ, సెక్షన్-21-ఎ.ఎ మరియు 21-బి లలో చెప్పబడిన అనర్హత పొందిన కమిటీ సభ్యులను తొలిగించుటకు మరియు 21 బి. మేరకు తిరిగి నియమించుటకు మహజన సభకు సిపార్సు చేయుటకు మరియు వారిపై తయారుచేసిన నివేధికలను సభముందుంచుట.

v) ఋణాలు లేక డిపాజిట్ల రూపేణా నిధులను సేకరించుట మరియు వాటిని పెట్టుబడి పెట్టుట.

vi) సభ్యులనుండి ఋణముల కొరకు వచ్చిన ధరఖాస్తులను సంఘ నిర్వహణాధికారి సిఫార్సు మేరకు, వారి సభ్యత్వకాలమును బట్టి మంజూరు చేయుట మరియు ఇతర సేవలు, సౌకర్యములను కల్పించుట.

vii) సాంవత్సరిక బడ్జెట్‌కు లోబడి వ్యాపార అవసరములకు గాను వ్యయమును మంజూరు చేయుట.

viii) సంఘ కమిటీ పదవీకాలము ముగియకముందే కమిటీ ఎన్నికలను బైలాలలో చెప్పబడిన మేరకు నిర్వహించుట. అయితే ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము 1964

సెక్షన్-43 ప్రకారము ప్రభుత్వ సహాయముపొందే చేనేత సహకార సంఘాలకు రిజిస్ట్రారు ఎన్నికలు నిర్వహించును.

ix) చట్టములో చెప్పబడిన మేరకు మహాజన సమావేశములను నిర్వహించుట.

x) సంఘ ఆడిట్‌ను సకాలంలో ముగింపజేసి ఆడిట్ రిపోర్ట్‌ను మహాజన సభ ముందుంచుట.

xi) సంఘ దినసరి పరిపాలనకు సంబందించిన వ్యవహారములపై నిర్ణయములు గైకొనుట.

xii) సిబ్బంది నియామవళిని, అర్హతలను, వేతన స్కేళ్ళు మరియు ఇతర అలవెన్సులను, పరిపాలన మరియు సాదరు ఖర్చుల నిధికి లోబడి నిర్ణయించి సంఘ మహాజన సభ మరియు రిజిస్ట్రారు ఆమోదమునకు పంపుట.

xiii) సెక్షన్ 51 క్రింది విచారణ నివేధికలను సెక్షన్ 52 లేక 53 క్రింది తనిఖీ నివేధికలను లేక సెక్షన్ 50 క్రింది ప్రత్యేక ఆడిట్ నివేదికను మహాజనసభ ముందుంచుట.

xiv) సెక్షన్ 50, 51, 52 లేక 53ల క్రింద అందజేయబడిన నివేదికల్లో చూపబడిన తప్పులను సరిదిద్దుట.

xv) సెక్షన్ 59 క్రింద సంఘఅధికారిని లేక సిబ్బందిని సస్పెండ్ చేయుట.

xvi) ఈ చట్టము మరియు అమలునందున్న ఇతర చట్టముల క్రింద ఏదేని నేర ప్రవృత్తికి చెందిన అభియోగము మోపబడిన ఎవరేని వ్యక్తి మీద దావా వేయుటకు చర్య చేపట్టుట.

xvii) అపరాదుల జాబితాను తయారుచేసి నిర్దేశించిన రీతిలో ప్రకటించి దానిని మహాజనసభ ముందుంచుట.

xviii) రావలసిన ఋణములను పరిశీలించి బకాయిల వసూలుకు తగిన న్యాయపరమైన చర్యలను గైకొనుట.

xix) సంఘమునకు సంబంధించిన సమాచారమును పర్యవేక్షక మండలికి, రిజిస్ట్రార్‌కు, ఆర్థికసహాయ బ్యాంకుకు మరియు సంఘము ఏ సమాఖ్య సంఘమునకు అనుబంధింపబడినదో దానికి పంపుట.

xx) పాలకవర్గసభ్యులకు, వారి బంధువులకు మంజూరు చేసిన ఋణములు మరియు వారు సంఘముతో చేసిన వ్యాపారము, వారిలో బకాయిపడిన వారితోకూడిన నివేదికలను మహాజన సభ ముందుంచుట.

xxi) సంఘ వార్షికనివేదిక సాంవత్సరిక ఆర్థిక పట్టికలు మరియు బడ్జెట్టును మహాజనసభ



ముందుంచుట.

xxii) సభ్యులు, అధికారులు మరియు ఉద్యోగులకు సహకార విద్యను గరుపుటకు చర్యలు గైకొనుట.

xxiii) ఈ క్రింది అంశాలకు సంబంధించిన సమాచారం – నివేదికలు, పట్టికలను మహాజనసభ ముందుంచుట.

ఎ) ఆస్తుల విక్రయం

బి) నగదు వస్తు నిల్వలోటు

సి) క్షేమనిధి, యితర నిధులతో పాటు నిఖరలాభాల పంపిణీ

డి) పారు భాకీల రద్దు

ఇ) సభ్యత్వం నుండి తొలగింపు

ఎఫ్) సహకార విద్యానిధికి విరాళం, పరిపాలనా సాదరు ఖర్చుల నిధి ఏర్పాటు

జి) సంఘ ఆశయాలకు విరుద్ధంగా పనిచేసిన సభ్యుల బహిష్కరణ

హెచ్) ఆర్థిక సహాయం చేయు బ్యాంకుకు సంఘంను అనుబంధించుట

ఐ) ఆర్థిక సహాయం చేయు బ్యాంకునకు మరియు ఇతర సంఘములకు ప్రతినిధులను ఎన్నిక చేయుట.

జె) పర్యవేక్షక మండలి, అంతర్గత ఆడిటర్ల నియామకం వారి నివేదికల పరిశీలన మరియు తగిన చర్యలను చేపట్టుట.

xxiv) సంఘములు అభివృద్ధి చేయుటలోను, సంఘము రిజిస్ట్రేషను సందర్భములోను అయిన ప్రాథమిక ఖర్చులను చెల్లించుట మరియు బడ్జెట్‌కు లోబడి ప్రయాణ ఖర్చులు మరియు భత్యము చెల్లించుట.

xxv) సంఘ వ్యాపారమునకు అనువగు సబ్‌కమిటీలు మరియు ప్రత్యేక కమిటీలను నియమించుట,

xxvi) ఉప నిబంధనలో నిర్దేశించిన ప్రకారము, సంఘములో పనిచేయుచున్న ఉద్యోగులకు ప్రావిడెంటు ఫండు మరియు తదితర నిధులను ఏర్పరచుట మరియు వాటిని నిర్వహించుట,

xxvii) సంఘము తరపున కాంట్రాక్టులలో పాల్గొనుటకు, అందుకు ఉద్దేశింపబడిన వ్యాపార నిబంధనలు పైసలా చేయుట మరియు అన్ని దస్తావేజులు, ఒప్పందములు, పత్రములను

వ్రాయుట మరియు సంఘ వ్యాపారమునకు సంబంధించిన రశీదులను జారీచేయుటకు ఒక ఆఫీసరుకు అధికారమిచ్చుట,

xxviii) సంఘముచే గాని, సంఘమునకు వ్యతిరేకముగాని ఏతేదీని న్యాయ సంబంధమైన ఉపక్రమణలరీత్యా కేసు పెట్టుట, నడిపించుట, ప్రతివాదము చేయుట, రాజీచేసుకొనుట లేదా పరిష్కారము చేసుకొనుట,

xxix) వాటాలు మరియు ప్రభుత్వము లేదా తదితర సెక్యూరిటీలను సంఘము తరపున ఎండార్సుమెంటు వ్రాయుటకు, అమ్ముట, బదిలీచేయుట లేదా తదితర విధముగా వ్యవహరించుట సెక్రటరీకిగాని లేదా ఒకరు లేక అంతకుమించిన కమిటీ సభ్యులకుగాని ఉద్యోగులకుగాని అధికారమిచ్చుట,

xxx) బ్యాంకు అకౌంటు లావాదేవీలు నడిపించుటకు సెక్రటరిగాని లేదా ఒకరు లేక అంతకు మించిన బోర్డు / కమిటీ సభ్యులకుగాని అధికారమిచ్చుట,

xxxi) సంఘము వ్యాపారము నడిపించుటకు రిజిస్ట్రారు అనుమతితో ఉప నిబంధనావళిని తయారుచేయుట,

xxxii) సంఘమునందుంచబడుటకు రోజువారి నగదు నిల్వ గరిష్ఠ పిరిమితిని నిర్ణయించుట మరియు సంఘము ఆస్తులను రక్షణ ఏర్పాటు చేయుటకు రిజిస్ట్రారువారి "అనుమతితో నిబంధనలు తయారు చేయుట".

xxxiii) సభ్యులు చెల్లించన వాటాధనము మీద 6 శాతముకు తక్కువగాని మొత్తమును వడ్డీగాగాని లేక డివిడెండుగాగాని చెల్లించుట. ఈ విషయములో జరుగు లోటుపాట్లకు పాలకవర్గము బాధ్యతవహించవలెను.

xxxiv) కొత్త కమిటీ ఎన్నికైనపుడు లేదా రిజిస్ట్రారుచే ఒకకమిటిగాని లేదా ఒక వ్యక్తిగాని నియమింపబడినప్పుడు, పాతకమిటీవారు సంఘరికార్డులు మరియు ఆస్తులు అప్పగించవలెను.

**26.** రిజిస్ట్రారు ఆమోదమునకు లోబడి పాలకవర్గము సంఘ నిర్వహణకు అవసరమైన ఉపనిబంధనలను ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము నెం. 7 రు(1964)కు, ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలకు ఈ బైలాలకు అనుగుణముగా ఉండునట్లు రూపొందించుకొను అధికారమును కలిగియున్నది.

**27. ఉద్యోగుల ఉద్యోగ షరతులు :**

ఉద్యోగములను తీసుకొను పద్ధతి ఉద్యోగ షరతులు, సంఘ వేతనోద్యోగుల సిబ్బంది జీతముల స్కేళ్ళను, భత్యములను నిర్ణయించుటకు, మార్చుటకు, క్రమబద్ధము చేయుటకు, వారిపై క్రమశిక్షణ చర్యలను తీసుకొనుటకు విధి విధానములను అవలంభించుటకు పద్ధతులను, పాలవకర్గము యూనియన్ మార్గదర్శక సూత్రములననుసరించి రూపొందించుకుని, రిజిస్ట్రారు ఆమోదమును పొందినవై యుండవలెను.



**28. మీటింగుల నోటీసులు :**

అ) ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలలో వేరొక విధముగా నిర్ణయించిన తప్ప, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులకు, ఎజండాతో సహా మీటింగులకు నోటీసులు పంపుట ఆయన విధియై యున్నది. పాలకవర్గము మీటింగ్ తేదీకి కనీసము 7 రోజులు ముందుగా నోటీసులు పంపబడవలెను. మీటింగులకు పంపబడు నోటీసులన్నియు ఈ క్రింది పద్ధతులలో యే ప్రకారముగనైన పంపబడవలెను.

1. లోకల్ డెలివరి
2. సర్టిఫికేట్ ఆఫ్ పోస్టింగ్ తీసుకునొ పోస్టులో
3. సభ్యులలో సర్క్యులేషన్ ద్వారా

ఆ) చిరునామాలతో మార్పులేమైన ఉన్నప్పుడు ఆ మార్పులను సంఘమునకు తెలియపరచుట సభ్యుల విధియై యున్నందున సభ్యుడు ఇచ్చిన చిరునామాకు నోటీసు పంపినయెడల మీటింగ్ నోటీసు సరిగా ఇవ్వబడినట్లే భావింపబడును. బైలాలకు సవరణ విషయములో చేయబోవు సవరణల స్వభావమును గూర్చి వీలున్నంత స్పష్టముగా నోటీసులో ఉదహరింపబడియుండవలెను.

ఇ) అత్యవసరమైన, ముఖ్యమైనటువంటి ఏ విషయమునైన ఎజండాలో ఉదహరించి యుండకపోయినప్పటికీ, బైలాలకు సవరణ తప్ప, అగ్రాసనాధిపతి అనుమతితో చర్చకు ప్రవేశపెట్టవచ్చు. అనుమతి నిరాకరింపబడిన యెడల వచ్చే మీటింగులో ఇది చర్చనీయాంశము కావలెను.

**29. పదవీ నిర్వాహకుల అధికారములు : (అధ్యక్షుడు, కార్యదర్శి)**

అధ్యక్షుడు నిర్వహించవలసిన విధులు, యింతకుముందు ఈ బైలాలలో చెప్పబడినవాటికి తోడు ఈ క్రిందివి కూడా ఉండవలెను.

i) పాలకవర్గము, మహాజన సభ చేసిన తీర్మానములను ఆచరణలో పెట్టుట.

ii) సంఘ దైనందిన కార్యకలాపములను అజమాయిషీ చేయుట.

iii) బైలాలలో ఉదహరింపబడిన పరిమితికి మించి ఉన్న మిగులు మొత్తములను బ్యాంకులో డిపాజిటు చేయునట్లు చూచుట ఏ రోజు సేకరించు పాలకు ఆ రోజే డబ్బు చెల్లించు పద్ధతి అమలులో ఉన్నచో మూడు రోజులకు కావలసిన పాలు నగదు యిచ్చి కొనుటకు అగు సగటు మొత్తమునకు ఆరు రెట్లకు మించి రొక్కము నిలువ లేకుండునట్లు చూచుట.

iv) సరుకు, సాధన సామాగ్రి, పనికిరాని సరుకు మొదలైనవి ఎంతెంత నిలువ ఉన్నది మూడు నెలలకొకసారి సరిచూచుట లేక సరిచూడబడుటకు చర్య తీసుకొనుట. ఆ ప్రకారము చేయబడినట్లు పాలకవర్గము దృష్టికి తేబడినట్లుగా పాలకవర్గముచే తీర్మానము చేయించుట.

v) సంఘ కార్యకలాపములు సహకార సంఘముల చట్టము, నిబంధనలు సంఘ బైలాలననుసరించి నిర్వహింపబడునట్లు చూచుట.

vi) ఆడిటు రిపోర్టులలోను తనిఖి నివేదికలలోను, దర్శన పత్రములలోను వివరింపబడిన లోపముల సత్వర సవరణకు తగిన చర్యలను తీసుకొనుట.

vii) సహకార శాఖ, బ్యాంకు, యూనియన్ కోరిన అన్ని వివరములను సత్వరమే అందజేయబడునట్లు చూచుట.

viii) సాధ్యమైనంతవరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించుట, అటువంటి ఫిర్యాదులను తన అభిప్రాయముతో సహా పాలకవర్గము ముందుంచుట.

ix) సంఘములో వ్రాయబడు పుస్తకాములను కార్యదర్శితోపటు అధ్యక్షుడు తన సంతకము ద్వారా ధృవీకరించవలెను.

**30. కార్యదర్శి విధులు, బాధ్యతలు :**

ఎ) ఆయన, మేనేజింగు కమిటీవారిచే అప్పుడప్పుడు తనకు ధారాదత్తముచేయు అధికారములను చెలాయించవలెను.

బి) మేనేజింగు కమిటీవారిచే నియమింపబడిన పరిమితులకు లోబడి, ఆయన సంఘపు బ్యాంకు అకౌంటు లావాదేవీలు నడిపించుటకు అధికారము కలిగియుండవలెను.

సి) ఆయన ఈ క్రింది వాటికి జవాబుదారై యుండవలెను.

i) సంఘము తరుపున ఉత్తరప్రత్యుత్తరములను జరుపుట మరియు సంఘముయొక్క లెక్కల (అకౌంట్‌ల) పుస్తకములను, రిజిష్టర్లను నిర్వహించుట:



ii) ఉపనిబంధనల ననుసరించి, సంఘంయొక్క కార్యకలాపములను నిర్వహించుట.

iii) డిపాజిట్లను స్వీకరించి, ఇందు నిమిత్తము తయారుచేయబడిన నియమావళి ప్రకారము డిపాజిట్ల సర్టిఫికెట్లను జారీచేయుట మరియు అట్టి డిపాజిట్లు కాలపరిపక్వము పొందిన పిమ్మట వడ్డీతో సహా ఇచ్చివేయుటకు ఏర్పాట్లు చేయుట:

iv) బడ్జెట్ కేటాయింపునుండి మేనేజింగు కమిటీచే నిర్ణయింపబడిన ప్రతివొక పద్దు పరిమితుల మొత్తమునకు లోబడి కంటింజెన్సీలపై ఖర్చు చేయుటకు:

v) సంఘ సభ్యత్వమునకు వచ్చు ధరఖాస్తులను స్వీకరించుట అట్టి ధరఖాస్తుదారులకు సంబంధించిన రికార్డులను నిర్వహించుట, అట్టి ధరఖాస్తులన్నియు మేనేజింగు కమిటీ మరియు మహాజన సభముందుంజుట 1964 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల 7వ చట్టములోని 19 (3) విభాగము క్రింద నియమింపబడిన కాలపరిమితిలోగా మహాజన సభ నిర్ణయమును ధరఖాస్తుదారునకు తెలియజేయుట:

vi) సంఘమునకు చెల్లింపబడు యావత్తు పైకములకు రశీదులిచ్చుట అయితే సంఘము తీసుకొను అన్ని ఋణములకు వ్రాసియిచ్చెడు రశీదులు లేక పత్రములను కార్యదర్శి మరియు మేనేజింగు కమిటీ సభ్యులలో ఇద్దరు సంతకము చేయవలెను. అట్టి మేనేజింగు కమిటీ సభ్యులలో అధ్యక్షుడు గాని, ఉపాధ్యక్షుడుగాని ఒకరుగా వుండవలెను.

vii) సంఘము లావాదేవీలకు లేదా సంఘము కార్యకలాపములు నెరవేర్చుటకు అవసరమైన ఓచర్లు, రశీదులు, ఆస్తి అప్పులను చూపు బ్యాలెన్సు షీటు మరియు రిజిస్ట్రారు వారిచే ఇతర డాక్యుమెంట్లు మరియు స్టేట్‌మెంట్లు తయారు చేయుట

viii) సంఘ మహాజనసభ జరుపుటకు ముందు ఎన్నికలు జరుపుటకు ముందుగా బైలాలో నిర్దేశింపబడిన రీతిలో ఓటు హక్కు కలిగిన కలిగిలేని సభ్యుల జాబితాను తయారుచేసి పాలకవర్గము అనుమతితో సంఘముఖ్య కార్యాలయము దాని బ్రాంచీల నోటీసుబోర్డులందు ఉంచవలెను.

ix) తాను వ్రాసివుంచిన పుస్తకముతోపటు అధ్యక్షుని సంతకముతో ధృవీకరించవలెను.

మరియు రిజిస్ట్రారు వారిచే కోరబడు యితర డాక్యుమెంట్లు మరియు స్టేట్‌మెంట్లు తయారుచేయుట.

**31. మహాజన సభ అధికారాలు :**

సంఘం తుది అధికారం సర్వసభ్య మండలి పరమైయుండును. అయితే ఈ అధికారం కమిటీ లేక సంఘ ఏ అధికారికి చట్టం, రూల్స్, బైలాల ద్వారా లభించిన అధికారాలను వారు వినియోగించుటకు భంగం కలిగించరాదు.

ఈ చట్టంలోని ఇతర నిబంధనలకు లోబడి సర్వసభ్య మండలి ఈ క్రింది విషయాలు నిర్వహించవలెను.

i. సభ్యులు, కమిటీ సభ్యుల ఎన్నిక, తొలగింపు;

ii. రిజిస్ట్రారుకు వార్షిక నివేదికలు సమర్పించుట;

iii. ఆడిట్ రిపోర్టు, వార్షిక రిపోర్టు పరిశీలన;

iv. నికర లాభాలను పరిష్కరించుట;

v. నిబంధనావళి సవరణ;

vi. సభ్యుని బహిష్కరణ;

vii. ఆదాయ వ్యయాలు, వార్షిక బడ్జెటును ఆమోదించుట;

viii. ఆర్థిక సహాయం చేయు బ్యాంకుకు లేదా ఇతర సంఘాలకు సంఘమును అనుబంధీకరించుట;

ix. ఆర్థిక సహాయం చేయు బ్యాంకు గాని, లేక ఇతర సంఘాలకు గాని ప్రతినిధులను ఎన్నుకొనుట అయితే ఈ నిబంధన క్రింద ప్రతినిధి ఎన్నుకొనబడేవరకు అధ్యక్షుడే అట్టి అనుబంధ సంఘాలకు ప్రతినిధిగా వ్యవహరిస్తారు;

x. కమిటీ సభ్యులకు లేదా నిర్ణయింపబడునట్టి వారి సమీప బంధువులకు మంజూరు చేయబడిన ఋణములను, అడ్వాన్సులను లేదా వారు సంఘముతో చేసిన వ్యాపారమును సమీక్షించుట, సంఘమునకు రావలసిన పైకాలను రాబట్టుటలో జరిగిన ఏదేని లోపమును గురించి రిజిస్ట్రారుకు నివేదించుట;

xi. కమిటీ సభ్యులు కాని సభ్యుల నుండి ఇద్దరిని అంతర్గత ఆడిటర్లుగా నియమించుట;

xii. తన చేత నియమింపబడిన అంతర్గత ఆడిటర్ల యొక్క నివేదికను పరిశీలించుట;

xiii. సహకార విద్యానిధిని ఏర్పాటు చేయుట;



xiv. సెక్షను 51 క్రింద విచారణ నివేదికను, 52,53 ల క్రింద తనిఖీ నివేదికలను, సెక్షను 50 క్రింద జారీ చేయబడిన ప్రత్యేక ఆడిటు నివేదికలను పరిశీలించుట;

xv. పారుబాకీలు గుర్తించి నిర్ణయం తీసుకొనుట;

xvi. సరుకు, నగదు నిల్వలలో లోటును భర్తీ చేయుటకు ఏర్పాటు చేయుట;

xvii. పర్యవేక్షక మండలిని ఏర్పాటు చేసి, అది చేయవలసిన విధులను నిర్ధారించుట మరియు దాని నివేదికను పరిశీలించుట;

xviii. ఆస్తి, బాధ్యతల బదిలీ, సంఘ విభజన లేక ఏకీకరణకు సంబంధించిన నిర్ణయం చేయుట;

xix. కమిటీ సభ్యుల సమావేశపు హాజరును సమీక్షించుట;

xx. సభ్యత్వమును సమీక్షించుట;

xxi. కమిటీ సభ్యుల మరియు సభ్యుల యొక్క అనర్హతలకు సంబంధించిన నివేదికను సమీక్షించుట;

xxii. బకాయిలను మరియు బకాయీ దారులను సమీక్షించుట;

xxiii. సిబ్బంది నియమావళిని, వారికి చెల్లించవలసిన జీత భత్యములను మరియు సాదరు ఖర్చులను, పరిపాలన మరియు సాదరు ఖర్చుల నిధికి లోబడి ఆమోదించి, రిజిస్ట్రారు వారి ఆమోదమునకు పంపుట;

రూలు (26-ఎ) ప్రకారం పైన చెప్పబడిన అంశములు మాత్రమే గాక క్రింద చెప్పబడు అంశాలు కూడా మహాజన సభ చర్చనీయాంశాలుగా ఉండాలి;

ఎ. పర్యవేక్షక మండలి సూచనలు.

బి. సభ్యులు, పాలకవర్గ సభ్యులు, పాలకవర్గం మొత్తం అనర్హతకు సంబంధించిన అంశములు.

సి. అపరాధుల(డిఫాల్టర్స్)కు సంబంధించిన అంశములు.

డి. సంఘములో ఉంచుకున్న సహకార విద్యా నిధి వినియోగం గూర్చి.

**32. మహాజన సభకు కోరం :**

సర్వసభ్య సమావేశమునకు హాజరగుట సంఘములోని ప్రతి మెంబరు యొక్క విధియైయున్నది. తత్కాలమందు సంఘపు జాబితాలోని మొత్తము సభ్యుల సంఖ్యలో పదింట ఒక వంతు (1/10 లేదా 10 శాతము) తగ్గక హాజరై యుండిన యెడలనే సర్వసభ్య సమావేశమును జరుపవలెను. ఇతర సమావేశములకు చట్టములో పేర్కొన్న విధంగా కోరం ఉండవలెను

**33. సంఘ బైలాల సవరణ :**

సహకార సంఘాల శ్రేయస్సు దృష్ట్యా సహకార సూత్రాలకు సహకార సంఘాల చట్టం, నియమావళికి వ్యతిరేకంగాకాక నగదు నిబంధనావళికి మార్పులను, చేర్పులను చేయవలసి వచ్చినప్పుడు అట్టి మార్పు ఆవశ్యకతను వివరిస్తూ ప్రస్తుతమున్నరీతిని, మార్పుచేయవలసిన రీతిని తెలియజేస్తూ సంఘ సర్వసభ్య సమావేశము నందుంచి హాజరై ఓటు చేసిన సభ్యులలో 2/3 వంతు మెజారిటీ సభ్యుల ఆమోదము పొందవలెను. అట్టి మార్పును చేయుటకు అంగీకారము తెల్పు సర్వసభ్య సమావేశములో గైకొనబడిన తీర్మానము తేదీ నుండి 30 రోజులలోపల సదరు తీర్మానపు నకలును రిజిస్ట్రారుకు రిజిస్ట్రేషను నిమిత్తం పంపవలెను.

**34. సమావేశ చర్యలు రికార్డు చేయుట :**

సర్వసభ్య మండలి, మేనేజింగు కమిటీ లేదా ఏదేని ఉప కమటీ సమావేశపు చర్యలు సంఘము మినిటు పుస్తకములో రికార్డు చేయబడవలెను. మరియు కార్యక్రమానంతరం అట్టి చర్యల క్రింద సబాధ్యక్షునిచే అందులో సంతకము చేయబడవలెను.

**35. సంఘు వ్యాపారము :**

సంఘము తన సభ్యులనుండి/ఇతరులనుండి సేకరించిన పాలను తాను అనుబంధమైయున్న జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్‌కు మాత్రమే విక్రయించవలెను.

**36.** ప్రతి సంఘ సభ్యుడు తానువాడుకొనగా మిగిలిన పాలను తాను సభ్యుడుగా ఉన్న సంఘమునకే విక్రయించవలెను. సభ్యుడు నీళ్ళతోగాని మరేయితర పదార్థముతోకాని పాలను కల్తీ చేసిన యెడల ఆ కల్తీపాలను సంఘము స్వాదీనము చేసుకొని, అతనిని సభ్యత్వమునుండి తొలగించుటకు చర్య ప్రారంభించవలెను. సంఘ పాలకవర్గ అనుమతి తీసుకోకుండా, సభ్యుడు పాలను వేరొకరికి విక్రయించిన యెడల పాలకవర్గము అతనిని అతని సభ్యత్వ అర్హతలను, అతను మహాజనసభచే సభ్యత్వమునుండి తొలగింపబడు వరకు లేక వెళ్ళగొట్టబడువరకు, నిలుపుచేయును. సభ్యుడెవరైనా ఒక సహకార సంవత్సరములో పాల సరఫరా ప్రారంభించిన నాటినుండి కనీసం 150రోజులు మరియు/లేక 150 లీటర్లు, ఏది ఎక్కువైతే ఆ ప్రకారం అందజేయవలెను. ఆ ప్రకారం అందజేయనియెడల సభ్యుడుగానుండి అర్హతను కోల్పోవును. సంఘ మహాజన సభ 14 వ బైలానుసరించి అతనిని సభ్యత్వమునుండి తొలగించుటకు చర్యతీసుకొనవలెను. అయితే పాలు సరఫరా చేయలేదన్న కారణముగ తొలగింపబడిన సభ్యుడు, తొలగింపబడిన సంవత్సరము



గడచిన తరువాత రెండు నెలలు సరఫరా చేసిన యెడల సభ్యత్వమును తిరిగి పొందవచ్చు.

**37. పశుగ్రాసము ఉమ్మడి కొనుగోలు :**

పాలకవర్గము, బలవర్ధకమైన పశుగ్రాసమును, మేతను కొని సభ్యలకు పంపిణీ చేయవచ్చు.

**38. వేతన సిబ్బంది నియామకము :**

1. సంఘ వేతన అధికారి లేక సిబ్బందిగా ఆయా తరగతి ఉద్యోగములకు నియమింపబడుటకు అభ్యర్థులకు నిర్ణీత యోగ్యతలుండవలెను. ఆ ప్రకారము లేని యెడల నియమింపబడరాదు. సంఘము లేక సంఘములలో ఆయా తరగతి సర్వీసులకు సాధారణముగా పాలకవర్గము నిర్ణయించు ప్రకారము మరియు రిజిస్ట్రారు ఆమోదించిన ఉపనిబంధనల ప్రకారము హామీ యివ్వనియెడల నియమింపబడరాదు.
2. అవసరమైన యోగ్యతలు సంఘములోని ఆయా తరగతి ఉద్యోగములకు నిర్ణయించిన ప్రకారము లేకపోయినను, రిజిస్ట్రారు నిర్ణయించిన ప్రమాణము ప్రకారము హామీ యివ్వకపోయినను ఉద్యోగములో ఉండుటకు అర్హుడుకాడు.
3. స్వయముగాకాని, ఉమ్మడిగాకాని సంఘముయొక్క ఉద్దేశ్యములతో అనగా పాలు, పాల ఉత్పత్తులు, పశుగ్రాసము, పశువుల పోషకాహార రవాణాల వంటి వాటితో సంబంధముకల ఏ వ్యాపారంలోగాని కాంట్రాక్టులోగాని సంబంధము కలిగియుండరాదు.
4. ఏ స్థానిక సంస్థలోగాని మరే యితర సహకార సంస్థలోగాని అతను వేతనోద్యోగిగా లేక రహితముగా సేవలను చేయరాదు.
5. నైతిక పతనమునకు సంబంధించిన నేరములకు శిక్షపడి ఉండరాదు.
6. ఈ సంఘములోకాని, మరే యితర సంఘములోకాని విధుల దుర్వినియోగమునకు శిక్ష పడిన వాడై యుండరాదు.
7. అతడు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టములో చెప్పబడిన విధులను వేటిని ఉల్లంఘించియుండరాదు. సంఘ ఉద్యోగియెవరైన, ఎప్పుడైన తన సర్వీసు కాలములో పై షరతులను పాటించనట్లు కనిపించిన ఎడల పాలకవర్గము అతనిని ఉద్యోగమునుండి వెంటనే తీసివేయవలెను.

**39. లాభములు :**

ఆడిటు రిపోర్టు ప్రకారము సంఘ నికర లాభములను ఈ దిగువ చూపిన విధముగా కేటాయించవలెను.

1. నికర లాభములో 25 శాతమునకు తగ్గకుండా క్షేమనిధికి జమచేయవలెను.
2. సంఘము ప్రత్యేకముగ ఆడిటుకగు ఖర్చులు భరించలేకపోయినను 1964 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలలోని 46 వ నిబంధన కింద ఆడిటు ఫీజును స్కేలు ప్రకారము చెల్లించకపోయినను, నికర లాభములో 10 శాతము ఆడిటు నిధికి జమకట్టవలెను.
3. నికర లాభములో మూడు శాతము చొప్పున మొత్తము మీద రు. 2,500/-లకు మించకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్‌కు సహకార విద్యానిధికి జమకట్టవలెను.

   అ. మిగిలిన మొత్తము నుండి 15 శాతముకు తక్కువగాని మొత్తమును సభ్యులకు డివిడెండ్లుగా పంచవలెను.
4. మిగిలిన దానిలోనుండి లాభముల పంపకము ఈ క్రింది విధముగా జరుగవలెను.

   అ. సభ్యులు సంఘముతో చేసిన వ్యాపారమునుబట్టి 15 శాతం సరుకులకు (రిబేటు) రూపములో చెల్లించవలెను.

   ఆ. 10 శాతం 38 వ బైలా క్రింద ఏర్పాటు చేసిన పశుగణాభివృద్ధి నిధికి చెల్లించవలెను.

   ఇ. బోనసు చట్టము అన్వయించిన మేరకు ఆ చట్టవిధుల ప్రకారము సిబ్బందికి బోనసు చెల్లించవలెను.

   ఈ. 5 శాతం సహకార ప్రచారనిధికి

   ఎఫ్. 10 శాతం సాముదాయక ప్రయోజన నిధికి చెల్లించవలెను.

**40. క్షేమనిధి :**

1. క్షేమనిధి సంఘమునకంతకు చెందిన నిధి. అనుకోని నష్టములను ఎదుర్కొనుటకు ఏర్పాటు చేయబడినది. అవిభాజ్యమైనది. సభ్యులెవరు అందులో వాటా కోరుటకు వీలు లేదు. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము 1964 ను అనుసరించి మదుపు పెట్టవలసినది. అనుకోని నష్టములను ఎదుర్కొనుటకు ఈ నిధినుండి, రిజిస్ట్రారు



అనుమతితో వాడుకొనవచ్చు.

2. సంఘమును రద్దు చేసి మీదట, క్షేమనిధిని, బైలాలననుసరించి సంఘము ఏర్పాటు చేసిన యితర నిధులను, తన వశము చేయవలసినదనీ ఈ దిగువ చూపిన విధంగా తీర్చవలసినయున్నదని లిక్విడేటరు రాబట్టవలెను.

   అ. సంఘము బాకీలు.

   ఆ. చెల్లింపబడిన షేరు ధనము.
3. పై (2) వ క్లాజులో చెప్పబడిన చెల్లింపులుపోగా మిగులు ఏమైన ఉన్న యెడల, ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలు 1964 ప్రకారము వ్యవహరించవలెను.

   సి. చెల్లింపబడిన షేరు ధనము మీద, సంఘము ఎత్తివేయు తేదీనాటికి యివ్వవలసిన మొత్తము.

**41. వ్రాయబడవలసిన లెక్కలు :**

ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలు, 1964 ప్రకారము మరియు రిజిస్ట్రారు వారు ఎప్పటికప్పుడు ఆదేశించు ప్రకారము సంఘము యొక్క లెక్కలను, పుస్తకములను వ్రాయించి సదరు లెక్కలపై వచ్చు ఆడిటు రిపోర్టు మరియు తనిఖీ రిపోర్టును మహాజన సభ వారి ముందుంచుట పాలకవర్గము వారి విధియైయున్నది.

**42. ఇతర విషయములు :**

ఏ బైలాకైనను మార్పు, లేక సవరణ లేక రద్దు లేక కొత్త బైలాలను చేర్చుట మొదలగునవి మహాజన సభలో చర్చించి హాజరైన సభ్యులలో హెచ్చుమంది ఆమోదము పొందినతప్ప అమలులోనికి తేరాదు. అట్టి మార్పులను, చేర్పులను రిజిస్ట్రారు అనుమతించి రిజిష్టరు చేసిననే తప్ప అమలు పరచరాదు. అయితే రిజిస్ట్రారు సంఘ ప్రయోజనకారి అని భావించి, బైలా మార్పు చేయవలసినదని సంఘమును ఆదేశించవచ్చును. అట్లు ఆదేశించి సదరు బైలా మార్పులను 1964 సహకార సంఘముల చట్టము నిబంధనల ప్రకారము రిజిష్టరు చేయవచ్చు. అట్టి సవరణలను సంఘమే స్వయముగా నిబంధనల ప్రకారము చేసికొనినట్లు పరిగణింపబడి అమలులోనికి వచ్చును.

**43. చట్టము, చట్ట నిబంధనలు సభ్యులకు అందుబాటులో ఉంచబడవలెను :**

1964 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల 7 చట్టము, చట్ట నిబంధనలు, బైలాలు, క్రిందటి సంవత్సరము తాలూకు ఆడిటు చేయబడిన ఆస్తి, అప్పుల పట్టిక, లాభనష్టముల నివేదిక

సంఘ పాలకవర్గ సభ్యుల జాబితా, సభ్యుల పరిశీలనకు, అన్ని సహేతుకమైన వేళలో, ఉచితముగా, పరిశీలనకు సంఘము అందుబాటులో ఉంచవలెను. తమకు సంబంధించి లావాదేవీలు చూసుకొనుటకు అనుమతించవలసినదిగా సభ్యులెవరైన కోరిన యెడల సంఘము అనుమతించవలెను.

**44. సభ్యుల జాబితా :**

సంఘము సభ్యుల జాబితాను, సహకార సంవత్సరము చివరిరోజున ఉన్న ప్రకారము, సంవత్సరము ముగిసిన నెలరోజులలోపుగా తయారుచేయవలెను. అందులో ప్రవేశ సంఖ్య, సభ్యునిపేరు, తండ్రి లేక భర్తపేరు, సదరు సభ్యుని చిరునామా అందులో పొందుపరచబడి ఉండవలెను. ఆ జాబితా సంఘ కార్యాలయము వద్ద, సంఘ పనివేళలలో, సంఘ సభ్యుడెవరి తనిఖీకైనా సిద్ధముగా ఉంచబడవలెను. సభ్యులలో ఎవరైనా కోరితే, పాలకవర్గము యిందుకొరకు నిర్ణయించిన రుసుమును వసూలు చేసి, దాని నకలును వారికి యిచ్చుట కార్యదర్శి విధియైయున్నది.

**45. కార్యాలయ ఆవరణ వాడకము :**

సంఘము తన ఆవరణను, లేక అందులోని ఏదేని భాగమును లేదా దాని ఆస్తులలో వేటిని కాని, సంఘ కార్యకలాపములకు, వ్యాపారమునకు తప్ప వేరుగా తాను ఉపయోగించరాదు. యితరులను ఉపయోగించనీయరాదు.

**46. నివేదికలు :**

సంఘము ప్రతి సంవత్సరము రిజిస్ట్రారు సూచించిన పద్ధతిలో ఈ దిగువ నివేదికలను తయారు చేయవలెను.

ఎ. జమా ఖర్చుల స్టేటుమెంటు

బి. లాభనష్టముల స్టేటుమెంటు

సి. ఆస్తి అప్పుల స్టేటుమెంటు

డి. రిజిస్ట్రారు వారిచే అప్పుడప్పుడు నిర్ణయింపబడిన ఇతర నివేదికలు ప్రతి సంవత్సరము జూన్ 30 వ తేదీన ఉన్న ప్రకారము తయారు చేయవలెను. ప్రతిదాని నకలును రిజిస్ట్రారుకు 30 జన్‌తో ముగిసిన సహకార సంవత్సరాంతమైన 15 రోజులలోగా పంపవలెను.



**47. వివాదములు :**

సంఘము యొక్క పనికి సంబంధించి ఏదైనా వివాదము పాలకవర్గము క్రమశిక్షణా రాహిత్యమునకు తీసుకొనిన చర్యలు తప్ప ఈ దిగువ వారి మధ్య

అ. సభ్యులు, గత సభ్యులు, సభ్యులద్వారా, గత సభ్యులద్వారా మరియు చనిపోయిన సభ్యులద్వారా హక్కు ఉన్నట్లు చెప్పుకొనువారిమధ్య ; లేక

ఆ. సభ్యుడు, గత సభ్యుడు లేక సభ్యునిద్వారా హక్కు ఉన్నట్లు చెప్పుకొనువారు, గత సభ్యుడు లేక చనిపోయిన సభ్యునిద్వారా హక్కు ఉన్నట్లు చెప్పుకొనువారికిన్ని మరియు సంఘమునకు దాని కమిటీకి లేక దాని ఆఫీసరుకు ఏజంటుకు లేక ఉద్యోగికి మధ్య; లేక

ఇ. సంఘము లేక దాని కమిటీ మరియు గత కమిటీ దాని అధికారి, ఏజంటు లేక గత ఉద్యోగి లేక చనిపోయిన అధికారి వారసుడు చనిపోయిన ఏజంటు లేక చనిపోయిన ఉద్యోగుల మధ్య; లేక

ఈ. ఈ సంఘమునకు వేరొక రిజిష్టరు సంఘమునకు మధ్య వివాదము ఏర్పడినచో దానిని రిజిస్ట్రారుకు నివేదించవలెను. రిజిస్ట్రారు అట్టి వివాదమునకు సంబంధించి పత్రములు అందిన వెంటనే ఈ దిగువ చూపిన పద్ధతులలో ఏదేని ఒక పద్ధతిలో పరిష్కారమునకు ఏర్పాటు చేయవలెను.

1. తాను స్వయముగా పరిష్కరించదలచవచ్చు;

2. ఇందు నిమిత్తము, ప్రభుత్వము, అధికారములిచ్చిన ఏ యితర వ్యక్తికైనను దీనిని బదలాయించవచ్చు; లేక

3. మధ్యవర్తి పరిష్కారమునకు పంపవచ్చు.

రిజిస్ట్రారు యొక్క లేక వివాదము బదిలీ చేయబడిన వ్యక్తి యొక్క లేక మధ్యవర్తియొక్క నిర్ణయము లేక తీర్పు తుది నిర్ణయము లేక తీర్పుగా భావించబడవలెను. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము 70 వ సెక్షన్ నిధులకు లోబడి ఆ నిర్ణయమును ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము 1964 సెక్షన్ 70 క్రింద ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలలోని 52 వ నిబంధన క్రింద రిజిస్రారుకు అమలు దరఖాస్తు చేయుట ద్వారా అమలు పరచవచ్చు.

**48. చనిపోయిన లేక దొంగిలింపబడిన ఆస్తి :**

సంఘము తాలూకు సొమ్ము లేక ఆస్తి దొంగిలింపబడిన, లేక పోయిన లేక వేరొక విధముగా నష్టమైన దుర్లభమైనప్పుడు అటువంటి మొత్తమును ఆస్తి విలువను రిజిస్ట్రారు అనుమతిని పొంది మహాజన సభ రద్దు చేసుకొనవచ్చు.

**49. సంఘము ఇవ్వవలసిన మొత్తములు :**

సంఘము ఏవైనా మొత్తములను ఎవరికైనా యివ్వవలసి ఉండి ఆ మొత్తములను భారత కాలదోశ చట్టము ప్రకారము గడువులోపున తీసుకొనవలసిన వారు తీసుకొనకపోయినయెడల, ఆ మొత్తములను క్షేమనిధికి చేర్చవలెను.

**50.** సంఘము జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుకు, జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్‌కు, సంఘ ఉద్దేశ్యముల సాధనలో తోడ్పడు ఇతర సంఘములకు అనుబంధము చేయబడవలెను.

**51**. ఈ బైలాల అన్వయములో అభిప్రాయభేదమున్న యెడల రిజిస్ట్రారు నిర్ణయము తుది నిర్ణయము కాగలదు. దానికి సంఘము బద్ధురాలై ఉండును.

# పాల ఉత్పత్తి దారుల సహకార సంఘము లి.,

# నిబంధనావళి

1. సంఘముపేరు, ........................................................
   నెంబరు
   చిరునామా
   ..........................................................గ్రామము
   ..........................................................పోస్టు
   ..........................................................మండలం
   ..........................................................జిల్లా
2. రిజిస్ట్రేషన్ చేయబడిన తేదీ :
3. సంఘము పని ప్రారంభించిన తేదీ :
4. జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్‌కు అఫిలియేట్ చేయబడిన తేదీ మరియు యూనియన్ పేరు :
5. మరేయితర సంఘములకైనా అఫిలియేట్ చేయబడిన యెడల, అఫిలియేట్ చేయబడిన తేదీలు :
6. సంఘ వ్యవహారిక విస్తీర్ణము :

---

*ముద్రణ :*

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ లి.,**

గన్‌ఫౌండ్రి, హైదరాబాద్ – 500 001 ఫోన్ నెం. 23234148